
సాక్షి అనంతపురం

శుక్రవారం । 19 । సెప్టెంబర్ । 2025



టన్ను చీనీ రూ.16 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16 వేలు, కనిష్టంగా రూ.7 వేలు పలికాయి.



కిలో టమాట రూ.18


అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.18, కనిష్టంగా రూ.10 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం

35.6°/21.4°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జడితో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచింది.

శత ఉత్సవం.. నిర్లక్ష్యం



- సత్యసాయి శతజయంతి ఉత్సవాలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఉత్సవాలకు రెండు నెలలే గడువు
- మౌలిక వసతులపై దృష్టిసారించని వైనం
- రూ.25 కోట్లు అడిగితే రూ.3.10 కోట్లు మాత్రమే మంజూరు
- ప్రభుత్వ తీరుపై భక్తుల అసంతృప్తి

ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు సత్యసాయి శత జయంతి ఉత్సవాల కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ కూడా ఎంతో ప్రతిష్టాత్మకంగా వేడుకలను చేయాలని చర్యలు చేపట్టింది. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం బాబా శత జయంతి ఉత్సవాలను నిర్లక్ష్యం చేస్తోంది. ఉత్సవాలకు కేవలం రెండు నెలలే గడువున్నా నేటికీ మౌలిక సదుపాయల కల్పనపై దృష్టిసారించలేదు. రూ.25 కోట్ల నిధులు అవసరమని నివేదికలు పంపితే కేవలం రూ.3.10 కోట్లు మాత్రమే మంజూరు చేసింది.



చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండిన చిత్రావతి నది



అర్ధంతరంగా ఆగిపోయిన వాటర్ ట్యాంక్ పనులు

పుట్టపర్తి అర్బన్: ఇప్పటి వరకూ జరిగిన సత్యసాయి జయంతి వేడుకలు ఒక ఎత్తు అయితే ఈ సారి జరిగే శత జయంతి వేడుకలు మరో ఎత్తు. వందో జయంతి వేడుకలు అవడంతో 139 దేశాలకు చెందిన భక్తులతో పాటు దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి భక్తులు, భజన మండళ్ల నుంచి లక్షలాది మంది తరలిరానున్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ కూడా అందుకు తగ్గట్టుగానే ఏర్పాట్లలో నిమగ్నమమైంది. ఇప్పటికే సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ భవనాలు, పాఠశాలలు, ఆస్పత్రులు, మ్యూజియం, ఇతర ఆలయాలు, ఆర్చ్‌లకు పెయింటింగ్ పనులు పూర్తి చేసింది. వసతి కోసం అధునాతన భవంతులు నిర్మిస్తోంది. ఇంత పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించడానికి పుట్టపర్తి ముస్తాబవుతుంటే కూటమి ప్రభుత్వం మొద్దు నిద్రను వీడటం లేదు.

నామమాత్రంగా నిధుల మంజూరు..

శత జయంతి వేడుకల ఏర్పాట్ల కోసం రూ.25 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి అధికారులు నివేదిక పంపారు. అయితే కూటమి ప్రభుత్వం కేవలం రూ.3.10 కోట్లు మాత్రమే మంజూరు చేసింది. ఇందులో ప్రభుత్వ నిధులు రూ.2 కోట్లు, కలెక్టర్ నుంచి రూ.75 లక్షలు, 'పుడా' ద్వారా రూ.35 లక్షలు మంజూరయ్యాయి.

వసతికి కష్టమే..

సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు ఇప్పటి నుంచే వసతి కోసం హోటళ్లు, లాడ్జిల యజమానులను సంప్రదించి ముందస్తుగా బుక్ చేసుకుంటున్నారు. పుట్టపర్తి జిల్లా కేంద్రమైన తర్వాత అధికారులు, సిబ్బంది చాలా వరకూ పుట్టపర్తిలోనే వసతి గదులు ఏర్పాటు చేసుకున్నారు. వచ్చే భక్తులు కనీసం వారం రోజులు ఉండాలంటే ఎన్నో వ్యయప్రయాసల కోర్చాల్సి పరిస్థితి.

ఎక్కడ చూసినా చెత్తా చెదారం..

పట్టణంలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఎప్పుడు పొంగుతుందో తెలియని పరిస్థితి. ఒక చోట బాగు చేస్తే మరో చోట పొంగుతోంది. డ్రైనేజీ నీరంతా చిత్రవతి నదిలో పోతోందని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పర్యాటకులను ఆకర్షించడానికి చిత్రావతిలో ఏర్పాటు చేసిన బోటింగ్ సమీపంలోనే చెత్తా చెదారంతో కంపు కొడుతోంది. కనీసం దీన్ని శుభ్రం కూడా చేయలేకపోతున్నారు. చిత్రావతి నదికి ఇరువైపులా బండింగ్ చేయిస్తాం, బాబా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం, ఫౌంటెన్లు ఏర్పాటు చేస్తామని ఆర్భాటంగా ప్రకటనలు చేశారు తప్ప ఏదీ జరగలేదు. నదికి ఇరువైపులా చెత్తా చెదారం, పిచ్చి మొక్కలు, ముళ్లకంపలతో నిండిపోయింది. కర్ణాటక నాగేపల్లి బ్రిడ్జికి కింది భాగంలో ఇసుక కోసం విపరీతంగా గుంతలు తీశారు. పెద్ద సంఖ్యలో భక్తుల రాక నేపథ్యంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

గుంతలమయంగానే రోడ్లు..

ఇటీవల కురిసిన వర్షాలకు పుట్టపర్తిలోని రోడ్లన్నీ పాడైపోయాయి. ఎక్కడ చూసినా గుంతలమయమయ్యాయి. రోడ్ల మరమ్మతు విషయంలోనూ కూటమి ప్రభుత్వం వెనుకడుగు వేస్తోంది. ముఖ్యంగా వీఐపీలు, వీవీఐపీలు మందిరంలోకి వెళ్లే వెస్ట్ గేట్ రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. విమానాశ్రయం నుంచి లోనికి వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో పాటు బ్రాహ్మణపల్లి, బీడుపల్లి రోడ్లు, పెద్ద కమ్మవారిపల్లి రోడ్డు, దెబ్బతిన్నాయి. అలాగే సాయినగర్ మీదుగా వేసిన రింగ్ రోడ్డు అర్ధాంతరంగా ఆగిపోయింది. పట్టణంలో ఆటోలు నిత్యం రోడ్లపైనే ఉండడంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. పట్టణంలోకి వచ్చే వేలాది వాహనాలకు పార్కింగ్ పెద్ద సమస్య కానుంది. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేస్తే భక్తులు ఇబ్బంది పడతారు. ఇప్పటికే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా పోలీసులు కూడా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.



మందిరంలోకి వీవీఐపీలు వెళ్లే వెస్ట్ గేట్ రోడ్డు దుస్థితి

నీటి సమస్యను పరిష్కరించేరా?

అపర భగీరథుడిగా పేరొందిన సత్యసాయి బాబా నివసించిన పుట్టపర్తిలోనే తాగునీటి సమస్య పట్టిపీడిస్తోంది. నిత్యం ఏదో ఒక వీధిలో నీళ్లు రాలేదని స్థానికులు నిరసనలకు దిగుతున్నారు.ఈ నేపథ్యంలో శత జయంతి వేడుకలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు నీటిని అందించగలరా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పట్టణంలో చేపట్టిన ఇంటింటికీ కొళాయి పథకం వాటర్ ట్యాంకుల నిర్మాణంలోనే ఉంది.

మరుగుదొడ్లు శిథిలం

పుట్టపర్తిలో నిత్యం విద్యుత్ కోతలతో భక్తులతో పాటు పట్టణ వాసులు కూడా అల్లాడిపోతున్నారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయకపోతే ఇబ్బందులు అధికం కానున్నాయి. ఉన్న హైమాస్ లైట్లు కూడా వెలగడం లేదని, కొత్తవి ఎప్పుడు ఏర్పాటు చేస్తారని భక్తులు ప్రశ్నిస్తున్నారు. అలాగే పట్టణానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎక్కడా వంద మందికి అవసరమైన మరుగుదొడ్లు లేవు. తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసినా ఇబ్బందులు తప్పవు. గతంలో నిర్మించిన శాశ్వత మరుగుదొడ్లు నిర్వహణా లోపంతో శిథిలమయ్యాయి. మహిళలు, పిల్లలు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.



నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య శిబిరంలో సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి

గుత్తి: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారులు సూచించారు. గుత్తి ఆర్‌ఎస్‌లో ఇటీవల డెంగీతో హర్షిత్ (2), సంయుక్త (7) అనే చిన్నారులు మృతి చెందిన నేపథ్యంలో గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి ఈబీ దేవి, జిల్లా మలేరియా అధికారి ఓబులు పర్యటించారు. చిన్నారుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అపరిశుభ్రత, మురుగు కారణంగా దోమలు స్వైర విహారం చేస్తున్నట్లు తెలుసుకున్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకుని, తమకు జరిగిన నష్టం ఎవరికీ జరగకుండా చూడాలని మృతుల కుటుంబ సభ్యులు వైద్యాధికారులను కోరారు. అనంతరం వైద్యాధికారులు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి జ్వర పీడితులకు రక్త పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. ప్రతి ఒక్కరూ తప్పని సరిగా జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్యాధికారులు ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు అమర్నాథ్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రభాకర్, వైద్యులు రమ్య, షాషా వలి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రిని చంపిన తనయుడు



సుధాకర్ (ఫైల్)

పామిడి: తాగిన మైకంలో తల్లిని వేధిస్తుండడాన్ని తట్టుకోలేక కుమారుడు రోకలి బండతో మోది తండ్రిని హత్య చేశాడు. పామిడిలోని బెస్తవీధిలో బుధవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. పామిడి పోలీసులు తెలిపిన మేరకు.. సుధాకర్ (45) లారీ డ్రైవర్‌గా పని చేస్తూ భార్య మీనాక్షి, కుమారుడు ప్రకాష్‌ను పోషించేవాడు. ఇటీవల సుధాకర్ మద్యానికి బానిసయ్యాడు. తాగిన మైకంలో భార్య మీనాక్షిని వేధించేవాడు. బుధవారం అర్ధరాత్రి కూడా పూటుగా మద్యం తాగి వచ్చి భార్యను వేధించసాగాడు.ఈ క్రమంలోనే కోపోద్రిక్తుడైన కుమారుడు ప్రకాష్ తన తల్లి సహకారంతో రోకలిబండతో సుధాకర్ తలపై మోదాడు. దీంతో తలపగిలి సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ప్రకాష్‌తో పాటు మీనాక్షిని అరెస్ట్ చేశారు. సీఐ రాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- ప్రైవేటు బస్సు ఢీకొని ఒకరి దుర్మరణం



ఓబులేశు (ఫైల్)

రాయదుర్గంటౌన్: ప్రైవేటు బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు దుర్మరణం పాలయ్యారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణంలోని ఊరువాకిలి మొలకల్మూరు రోడ్డు క్రాసింగ్‌లో గురువారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. సీఐ జయనాయక్ తెలిపిన మేరకు.. గురువారం తెల్లవారుజామున మొలకల్మూరు రోడ్డు క్రాసింగ్‌లో మారెమ్మ గుడి ఏరియాకు చెందిన నాయకుల ఓబులేశు (60),అంబేడ్కర్‌నగర్‌కు చెందిన నాగరాజు రోడ్డు దాటుతుండగా ఎస్‌ఆర్‌జే ప్రైవేటు బస్సు వేగంగా వచ్చి ఢీకొంది. ఘటనలో ఓబులేశు కుడికాలు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. నాగరాజు ఎడమ కాలు తీవ్రంగా దెబ్బతింది. స్థానికులు ఇద్దరినీ స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ నాయకుల ఓబులేశు మృతి చెందాడు. నాగరాజును కుటుంబీకులు కర్నూలు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఓబులేశు కూలి పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఇతనికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జయనాయక్ తెలిపారు.

రెండు బార్లకు లాటరీ

అనంతపురం: జిల్లాలో రెండు బార్లకు లాటరీ ప్రక్రియ నిర్వహించారు. నూతన బార్ పాలసీలో భాగంగా ఇటీవల 9 బార్లకు రీ నోటిఫికేషన్ జారీ చేశారు. రెండు బార్లకు మాత్రమే దరఖాస్తులు అందాయి. ఈ క్రమంలో గురువారం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో కలెక్టర్ ఓ. ఆనంద్ ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం, గుత్తిలో రెండు బార్లకు లాటరీ నిర్వహించారు. ఎంపికైన వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి. రామమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాబు మెడి'కిల్'పై ఉక్కుపిడికిలి

- నేడు యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో 'చలో మెడికల్ కాలేజ్'



అనంతపురం కార్పొరేషన్: సీఎం చంద్రబాబు కుట్రపూరిత మెడి'కిల్'పై వైఎస్సార్ సీపీ ఉక్కుపిడికిలి బిగించింది. పేదింటి బిడ్డలకు వైద్య విద్య భారం కాకూడదని, పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలనే సంకల్పంతో గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర వ్యాప్తంగా 17 నూతన వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగానే ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పెనుకొండలో రూ.470 కోట్లతో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. చాలా వరకూ నిర్మాణ పనులు జరిగాయి. ఇక.. నిర్మాణ పనులు పూర్తి చేసి అప్పట్లోనే 5 కళాశాలలను ప్రారంభించారు. ఆ సమయంలోనే ఎన్నికలు రావడం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. పేదల ఆశలపై నీళ్లు జల్లుతూ సీఎం చంద్రబాబు 'పబ్లిక్ అండ్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ)'ని తెరపైకి తీసుకొచ్చారు. రాష్ట్రంలో 10 కళాశాలలను ప్రైవేటీకరణ చేసే చర్యలకు ఉపక్రమించారు. ప్రైవేట్ చేతుల్లోకి మెడికల్ కళాశాలలు వెళితే పేద విద్యార్థులు ఆ వైద్య కళాశాలల గుమ్మం ఎక్కలేని పరిస్థితి తలెత్తనుండడంతో పాటు వైద్యం ఖరీదవుతుందని, ఇది సమాజానికి మంచిది కాదని భావించిన వైఎస్సార్ సీపీ పోరాటాలకు సిద్ధమైంది. ఇప్పటికే మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని తేల్చి చెప్పారు. ఈ క్రమంలోనే శుక్రవారం యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో 'చలో మెడికల్ కాలేజ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా హాజరుకానున్నారు.

విజయవంతం చేయాలి

సీఎం చంద్రబాబు ఎప్పుడూ తన అనుయాయులకు దోచిపెట్టడం కోసం పోటీ పడుతుంటారు. రాజధాని పేరుతో రూ.లక్షల కోట్ల అప్పు తీసుకురావడంతో పాటు రైతుల భూములను లాక్కున్నారు. రాజధానిని కూడా పీపీపీలో అభివృద్ధి చేస్తారా అనే విషయాన్ని ఆయన చెప్పాలి. పేద పిల్లలు కూడా వైద్య విద్యనభ్యసించేందుకు అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మకంగా 17 వైద్య కళాశాలలను తీసుకువచ్చారు. పీపీపీ పద్ధతిలో వైద్య కళాశాలలు నడిస్తే నాణ్యమైన వైద్యం, పేదల పిల్లలకు వైద్య విద్య సాధ్యపడుతుందా అనేది ప్రజాప్రతినిధులు, మంత్రులు ఆలోచించాలి. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపడుతున్నాం. విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చి కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి.

– అనంత వెంకటరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

మతం పేరున ఆర్డీటీని వెళ్లగొట్టే పన్నాగం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: మతం పేరున ఆర్డీటీని వెళ్లగొట్టే పన్నాగం పన్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఆర్డీటీ పరిరక్షణ బాధ్యత సీఎం చంద్రబాబు తీసుకోవాలని, లేని పక్షంలో ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. గురువారం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరువు జిల్లా ప్రజలకు ఆర్డీటీ కల్పతరువులాంటిదన్నారు.బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిలో ఏటా 8.5 లక్షల మందికి వైద్య సేవలందుతున్నాయని చెప్పారు. ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయడంపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుండడంతో ఆర్డీటీ ఉనికికే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఎన్నికల ముందు పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ జిల్లాలో పర్యటించి ఆర్డీటీ అతిథి గృహంలోనే బస చేశారని, ఆ సమయంలో ఆర్డీటీకి సాయమందిస్తామని చెప్పి నేడు నోరు మెదపడం లేదని మండిపడ్డారు. ఆర్డీటీ సేవలు కొనసాగేలా చొరవ చూపాలని సీఎం చంద్రబాబుకు ఈ ఏడాది ఏప్రిల్‌లోనే లేఖ రాశామన్నారు. ఇప్పటికే వైఎస్సార్ సీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య నాయకత్వంలో ఆర్డీటీ పరిరక్షణ బైక్ ర్యాలీ, పాదయాత్ర చేశామన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లోపు ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ కాకుంటే ఆర్డీటీని మూసివేసే దుస్థితి వస్తుందన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఆర్డీటీపై తీర్మానం చేసి కేంద్రానికి పంపాలన్నారు. ఆర్డీటీపై లక్షలాది మంది ఆధారపడ్డారన్న విషయం కూటమి ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను ఒప్పించి ఆర్డీటీని కాపాడాలని, లేకపోతే అందరినీ కలుపుకుని ప్రభుత్వ మెడలు వంచైనా సంస్థను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, ఎద్దుల అమర్‌నాథ్‌రెడ్డి, నాయకులు రాధాకృష్ణ, సాకే కుళ్లాయ స్వామి, కేశవరెడ్డి, జానీ, భారతి తదితరులు పాల్గొన్నారు.

యూరియా సక్రమంగా పంపిణీ చేయాలి

- వ్యవసాయ అధికారులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశం



అనంతపురం అర్బన్: ''యూరియా అవసరమైన చోటికి సరఫరా చేసి రైతులకు పంపిణీ చేయాలి. క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ ఆర్థిక ప్రయోజనం చేకూర్చాలి'' అని కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమున్న రైతులకే యూరియాను పంపిణీ చేయాలని ఆదేశించారు. ఐఎఫ్‌ఎంఎస్ ఆన్‌లైన్ పోర్టల్, భౌతిక నిల్వలకు తేడా రాకుండా పర్యవేక్షించాలన్నారు. ఇందుకు సంబంధించి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఈనెల 24లోపు ఆన్‌లైన్ నివేదిక అందించాలన్నారు. యూరియా పంపిణీకి సంబంధించి రోజువారీ నివేదిక ఇవ్వాలన్నారు. యూరియా అవసరమున్న చోట అవుట్‌రీచ్ క్యాంపెయిన్ నిర్వహించి ఎక్కువ మంది రైతులు వచ్చేలా చూడాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఈకేవైసీ, ఎన్పీసీఐ లింక్ పెండింగ్‌పై దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించి ఐదు చొప్పున అగ్రిటెక్ స్టార్టప్‌లను గుర్తించాలని ఆదేశించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో మొక్కజొన్న, వేరుశనగ, తదితర పంటలు కోత దశలో ఉన్నాయని, వాటి ప్రస్తుత మార్కెట్ ధరలను క్షేత్రస్థాయి సిబ్బంది గమనిస్తూ సీఎం యాప్‌లో నమోదు చేసేలా చూడాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ (ఎంఐడీహెచ్) కింద పెండింగ్ లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. పశుకిసాన్ క్రెడిట్ కార్డులను వందశాతం అందజేయాలని చెప్పారు. ఆయిల్ పామ్ తోటల సాగుపై దృష్టి పెట్టాలన్నారు. ఎంపీఎఫ్‌సీ గోదాముల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలని ఆదేశించారు. జిల్లాలోని 58 పీఏసీఎస్‌లకు సంబంధించి సీడ్ లైసెన్స్, ఫర్టిలైజర్స్ లైసెన్స్ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఉద్యానశాఖాధికారి ఉమాదేవి, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి, ప్రకృతి వ్యవసాయం డీపీఎం లక్ష్మానాయక్,మార్కెటింగ్ ఏడీ రాఘవేంద్రకుమార్, డీసీఓ అరుణకుమారి, సెరికల్చర్ ఏడీ విజయ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆశగా రప్పించి.. నిరాశతో పంపించి

- 'కొత్త టీచర్లకు నియామక పత్రాల అందజేత' వాయిదా
- బస్సుల్లో కూర్చున్న తర్వాత ప్రకటించిన వైనం



గురువారం ఉదయమే పీవీకేకే కళాశాల వద్దకు చేరుకున్న డీఎస్సీ అభ్యర్థులు, వారి బంధువులు

అనంతపురం ఎడ్యుకేషన్: గుంటూరులో శుక్రవారం జరగాల్సిన 'డీఎస్సీ–25 కొత్త టీచర్లకు నియామక పత్రాల అందజేత' కార్యక్రమం వాయిదా పడింది. ముందెన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం ప్రచార యావ కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందనే ఆరోపణలున్నాయి. ఇందుకోసం జిల్లాలో 45 బస్సులు ఏర్పాటు చేశారు. ఒక అభ్యర్థికి తోడుగా కుటుంబ సభ్యుడు కచ్చితంగా రావాల్సిందేనని చెప్పారు. కొందరు అభ్యర్థుల కుటుంబ సభ్యులు తమకు వీలుకాదని, అనారోగ్యంగా ఉన్నామని వేడుకున్నా కనికరించలేదు. ప్రతి అభ్యర్థికి తోడుగా తప్పనిసరిగా కుటుంబ సభ్యుల్లో ఒకరు రావాల్సిందేనని, ఉద్యోగం కావాలంటే తప్పదని స్పష్టం చేశారు. గురువారం ఉదయం 6 గంటలకల్లా అనంతపురం రూరల్ ఆలమూరు రోడ్డులోని పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకోవాలని సూచించారు. ఇక్కడికి చేరుకోవడానికి అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు నానా అవస్థలు పడ్డారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఉన్నవారు సైతం రాత్రికి రాత్రే చేరుకున్నారు. మరికొందరు ఉదయాన్నే వచ్చారు. అక్కడ 45 బస్సులు సిద్ధం చేశారు. ప్రతి బస్సుకు నలుగురు లైజన్ ఆఫీసర్లను నియమించారు. అల్పాహారం సిద్ధం చేయగా.. అందరూ తిని బస్సుల్లో ఎక్కి కూర్చున్నారు. అయితే, వర్షాల కారణంగా కార్యక్రమం వాయిదా వేస్తున్నట్లు డైరెక్టరేట్ నుంచి సమాచారం అందడంతో ఆ మేరకు డీఈఓ ప్రసాద్‌బాబు అధికారికంగా ప్రకటించారు. ముందుచూపు లేకుండా కార్యక్రమం ఎలా ఏర్పాటు చేశారని పలువురు అభ్యర్థులు మండిపడ్డారు. వాతావరణ శాఖ నుంచి కనీస ముందస్తు సమాచారం కూడా తీసుకోరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా.. వచ్చిన వారందరికీ అప్పటికే సిద్ధంగా ఉన్న బస్సుల్లో వారివారి ఊళ్లకు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలకు బస్సులు పంపారు. మరోవైపు జిల్లా నుంచి వెళ్లే అభ్యర్థులకు కర్నూలు జిల్లా ఆత్మకూరు సమీపంలో మధ్యాహ్న భోజనాలు సిద్ధం చేశారు. కార్యక్రమం వాయిదా పడడంతో భోజనాలను సమీపంలోని స్కూళ్ల విద్యార్థులకు అందించినట్లు తెలిసింది.

క్లుప్తంగా

యూరియా కోసం వెళ్లి.. చెవికమ్మలు పోగొట్టుకున్న మహిళా రైతు

గుమ్మఘట్ట: యూరియా కోసం వెళ్లిన ఓ మహిళా రైతు తన చెవికమ్మలను పోగొట్టుకున్న ఘటన గుమ్మఘట్ట మండలం రంగచేడు గ్రామ సచివాలయం వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు... గురువారం ఉదయం గ్రామ సచివాలయం వద్ద యూరియా కోసం ఆర్‌ఎస్‌కే సిబ్బంది టోకన్లను ఇస్తున్న విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన రైతు గోవిందయ్యగారి మారెన్న భార్య చిత్తమ్మ వెళ్లింది. కొద్దిసేపటికే రైతులు అధిక సంఖ్యలో రావడంతో తోపులాట చోటు చేసుకుంది. ఆ సమయంలో చిక్కమ చెవులకు ఉన్న రూ. 25 వేలు విలువ చేసే కమ్మలు కిందకు పడిపోయాయి. తోపులాట నుంచి అతి కష్టంపై బయటకు పడిన అనంతరం చూసుకున్న చిక్కమ్మ గాలించినా ఫలితం లేకపోయింది. కమ్మలు పోగొట్టుకున్నా యూరియా టోకన్ మాత్రం దక్కకపోవడంతో మహిళా రైతు ఆవేదనకు అంతు లేకుండా పోయింది.

'పీపీపీ'ని ఉపసంహరించుకోకపోతే ఉద్యమం తప్పదు

- ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అఖిల్‌కుమార్ రెడ్డి


మాట్లాడుతున్న అఖిల్‌కుమార్ రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: కొత్త మెడికల్ కళాశాలల నిర్వహణలో పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానాన్ని ఉపసంహరించుకోకపోతే ఉద్యమం తప్పదని కూటమి సర్కార్‌ను అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అఖిల్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక ఏబీవీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పీపీపీ విధానాన్ని వ్యతిరేకించి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడం దుర్మార్గం అన్నారు. ప్రభుత్వ ఆస్తులు ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే ఆలోచనకు స్వస్తి పలకాలన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేలా పీపీపీ విధానాన్ని తీసుకురావడం సబబు కాదన్నారు. సమావేశంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విజయ్, నగర సంఘటన కార్యదర్శి అంకిరెడ్డి, నాయకులు భూత రాజు, హితేష్, విష్ణు, విజయ్ పాల్గొన్నారు.

కూటమిపై పోరుబాట

- సమస్యల పరిష్కారం కోరుతూ ఊపందుకున్న ఉద్యమాలు



కదిరి: ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఉపాధ్యాయ సంఘాలు చేపట్టిన ఉద్యమాలు ఊపందుకున్నాయి. రణభేరి పేరుతో యూటీఎఫ్ ఉద్యమానికి దిగింది. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోతే ఈ నెల 25న విజయవాడలో పెద్ద ఎత్తున బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని హెచ్చరికలు జారీ చేసింది. ఈ క్రమంలో రణభేరీ జాతా పేరుతో జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలు విజయవంతమయ్యాయి. ఏపీటీఎఫ్ సైతం వివిధ రూపాల్లో ఉద్యమాలు సాగిస్తోంది. ఈ నెల 11న నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. 12న మండల కేంద్రాల్లో నిరసనలు, 13, 14వ తేదీల్లో ప్రజా ప్రతినిధులకు వినతులు ఇచ్చారు. 15న డివిజన్ కేంద్రాల్లో, 16న జిల్లా కేంద్రంలో నిరసనలు తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన గళం..

దాదాపు ఏడాదిన్నరగా ఎన్నో వేధింపులను మౌనంగా భరిస్తూ వచ్చిన సచివాలయ ఉద్యోగుల్లో చివరకు సహనం నశించింది. ఈ నేపథ్యంలో తమ ఆత్మ గౌరవాన్ని వదులుకోక తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. ఇంటింటికీ వెళ్లి వాట్సాప్ సేవలపై ప్రచారం చేసే ప్రసక్తే లేదని, అవసరమైతే నిరవధిక సమ్మెకు సిద్ధమని, తమ సమస్యలు పరిష్కరించకపోతే అక్టోబర్ 1 నుంచి పింఛన్ల పంపిణీ ఆపేస్తామంటూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పోరుబాటలో విద్యుత్ ఉద్యోగులు..

తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో విద్యుత్ ఉద్యోగులు ఉద్యమబాట పట్టారు. ఈ క్రమంలో విద్యుత్ శాఖలోని అన్ని యూనియన్లు ఏకతాటిపైకి వచ్చి జేఏసీగా ఏర్పడ్డాయి. ఈ నెల 15, 16వ తేదీల్లో నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. 17, 18వ తేదీల్లో భోజన విరామ సమయాల్లో ఆందోళనలు చేపట్టారు. 19, 20వ తేదీల్లో రిలే నిరాహార దీక్షలు చేయనున్నారు. 22న ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించనున్నారు.

సచివాలయ ఉద్యోగుల డిమాండ్‌లు ఇవే

- విధులకు సంబంధం లేని సర్వేలు, ఇతర పనుల నుంచి విముక్తి కలిగించాలి.
- శాఖల వారీగా మాతృశాఖలో విలీనం చేయాలి.
- సచివాలయాల్లోని అన్ని విభాగాల ఉద్యోగులకు ఒకే బేసిక్‌తో పదోన్నతి కల్పిస్తూ పీఆర్‌సీ స్లాబ్ వర్తింపజేయాలి.
- సెలవు రోజుల్లో బలవంతపు విధుల నుంచి విముక్తి కలిగించాలి.
- రికార్డు అసిస్టెంట్ క్యాడర్‌ను జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌గా అప్‌గ్రేడ్ చేయాలి.
- ప్రొబేషన్ కాలానికి గాను నోషనల్ ఇంక్రిమెంట్‌లు ఇవ్వాలి.

విద్యుత్ ఉద్యోగుల డిమాండ్‌లు కొన్ని..

- నగదు రహిత వైద్యం అందించాలి.
- 1999 ఫిబ్రవరి 1 నుంచి 2004 ఆగస్టు 31 మధ్య చేరిన ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి.
- పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను తక్షణమే చెల్లించాలి.
- ఇంజనీరింగ్ డిగ్రీ ఉన్న సబ్ ఇంజనీర్లకు ఏఈలుగా పదోన్నతుల్లో అవకాశం కల్పించాలి.
- దళారీ వ్యవస్థను రద్దు చేసి కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించాలి.
- మొత్తం 13 రకాల డిమాండ్లను ప్రభుత్వం ఎదుట ఉంచగా.. ఇందులో కాంట్రాక్టు కార్మికులకు సంబంధించే 6 డిమాండ్లు ఉన్నాయి.

టీచర్ల డిమాండ్‌లు కొన్ని..

- పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే చెల్లించాలి.
- సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలి
- 12వ పీఆర్‌సీని నియమించి, ఐఆర్ ప్రకటించాలి.
- అన్ని రకాల బకాయిలను తక్షణం చెల్లించాలి.
- యాప్‌ల భారంతో పాటు బోధనేతర పనులను ఎత్తివేయాలి.
- ఈహెచ్‌ఎస్ పరిమితిని రూ.25లక్షలకు పెంచాలి.

ఉద్యమం తప్పదు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటి వరకూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దీంతో ఒక్కో డిపార్ట్‌మెంట్ ఉద్యమానికి సిద్ధమవుతోంది. ఇప్పటికే పలు శాఖలకు చెందిన ఉద్యోగులు నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం తప్పదు.
– రామమోహన్ చౌదరి, ఏపీ ఎన్‌జీఓ సంఘం నేత

అన్ని సేవలూ నిలిపేస్తాం

ఈ నెలాఖరులోపు కూటమి ప్రభుత్వం మా డిమాండ్లను నెరవేర్చాలి. లేదంటే అక్టోబర్ 1వ తేదీ నుంచి పింఛన్ల పంపిణీతో పాటు ఇతర అన్ని రకాల సేవలూ నిలిపివేస్తాం.
– శివరాజ్, సచివాలయ ఉద్యోగుల సంఘం నేత

టీచర్ల సత్తా చూపిస్తాం

విద్యాసంస్కరణల పేరుతో టీచర్లను ఇబ్బందులకు గురి చేయడం మంచిది కాదు. పెండింగ్ డీఏలు వెంటనే ఇవ్వాలి. పీఆర్‌సీ నియమించి ఐఆర్ మంజూరు చేయాలి. ప్రభుత్వం స్పందించకపోతే కూటమి సర్కారుకు టీచర్ల సత్తా ఏమిటో చూపిస్తాం.
– శెట్టిపి జయచంద్రారెడ్డి, యూటీఎఫ్ నేత

చౌకబారు రాజకీయాలు మానుకో..

- మంత్రి సవితకు ఎమ్మెల్సీ మంగమ్మ హితవు



అనంతపురం కార్పొరేషన్: వైద్య కళాశాలను ప్రైవేటీకరణ చేయాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వైఎస్సార్‌సీపీ తప్పుబడితే మంత్రి సవిత చౌకబారు రాజకీయాలకు తెరలేపడం సిగ్గుచేటని ఎమ్మెల్సీ మంగమ్మ మండిపడ్డారు. చౌకబారు రాజకీయాలు మానుకోవాలని మంత్రికి హితవు పలికారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలోని పేద పిల్లలకు వైద్య విద్యను అందుబాటులో తీసుకువచ్చేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెనుకొండలో వైద్య కళాశాల ఏర్పాటు చేసేలా నిర్ణయం తీసుకున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 17 వైద్య కళాశాలలకు వైఎస్సార్ సీపీ హయాంలో అనుమతులు వచ్చాయన్నారు. ఈ కళాశాలలు పూర్తయి పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య చేరువైతే వైఎస్ జగన్‌కు మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా ప్రైవేటీకరణకు పాల్పడుతోందని విమర్శించారు. ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ సైతం చేష్టలుడిగి చూస్తున్నారని, రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

ఏడు పొట్టేళ్ల అపహరణ


దొంగతనం గురించి వెల్లడిస్తున్న దంపతులు

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ పరిధిలోని బీఎస్ఆర్ కాలనీలో దొంగలు పడి ఓ ఇంటి ఆవరణలో ఉన్న ఏడు పొట్టేళ్లను ఎత్తుకెళ్లారు. బాధితులు తెలిపిన మేరకు.. నాగన్న, హేమావతి దంపతులు కొన్ని రోజులుగా పొట్టేళ్ల పిల్లలను తెచ్చుకుని వాటిని మేపి పెద్దవయిన తర్వాత విక్రయించగా వచ్చిన సొమ్ముతో జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం దాదాపు 4 నెలల వయసున్న 15 పొట్టేళ్లు ఉన్నాయి. వీటి పోషణకు చుట్టూ బండలు పాతి షెడ్డు ఏర్పాటు చేశారు. బుధవారం అర్ధరాత్రి తర్వాత ఓ బండను పక్కకు తప్పించి అందులో నుంచి 7 పొట్టేళ్లను దుండగులు ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం పొట్టేళ్లు కనిపించకపోవడంతో దంపతుల ఆవేదనకు అంతులేకుండా పోయింది. గతంలోనూ నాలుగు పొట్టేళ్లను ఎత్తుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు.

రైల్వేలో క్యూఆర్ కోడ్‌తో జనరల్ టిక్కెట్ల విక్రయాలు


ఉద్యోగి ధరించిన జాకెట్ వెనుక ఉన్న క్యూర్ కోడ్‌ను స్కాన్ చేసి, టిక్కెట్ పొందుతున్న యువకుడు

గుంతకల్లు: దసరా, దీపావళి పండుగల రద్దీ దృష్ట్యా రైల్వేలో జనరల్ టిక్కెట్లు (అన్ రిజర్వ్) కొనుగోలును మరింత సులభతరం చేయడానికి క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు సీనియర్ డీసీఎం మనోజ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో రెట్రో రిఫ్లెక్టివ్ జాకెట్లపై క్యూర్ కోడ్‌ను ముద్రించారు. ఈ జాకెట్లను సంబంధిత విభాగపు సిబ్బంది ధరించేలా చేశారు. జాకెట్ వెనుక భాగంలో ఉన్న క్యూ ఆర్ కోడ్‌ను యూటీఎస్ మొబైల్ యాప్ ద్వారా స్కాన్ చేసి టిక్కెట్‌ను పొందే వెసులుబాటు కల్పించారు. అన్‌రిజర్వ్డ్, ప్లాట్‌ఫారం టిక్కెట్లు కొనుగోలు చేసే సమయంలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల వివరాలను తెలుసుకునేలా సిబ్బంది సహకరిస్తారు. అంతేకాక టిక్కెట్ కొనుగోలు చేసినప్పుడు 3 శాతం బోనస్ క్రెడిట్ అవుతుంది. ప్రస్తుతం డివిజన్‌లో ఎక్కువగా రద్దీ ఉండే తిరుపతి, గుంతకల్లు రైల్వే జంక్షన్లలో ఈ విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు.

పిల్లల ప్రాణాలు పోతున్నా పట్టదా?


గుంతకల్లు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్‌ను నిలదీస్తున్న నాయకులు, మహిళలు

గుంతకల్లుటౌన్: 'పట్టణంలో ఎక్కడ చూసినా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ పిల్లలపై దాడి చేస్తున్నాయి. కార్లల్లో తిరిగి వాట్సాప్ గ్రూపుల్లో ఫొటోలు షేర్ చేయడం కాదు. వీధుల్లో నడుచుకుంటూ తిరగండి. మీకు ఏ వీధిలో ఎన్ని కుక్కలున్నాయో..అవి ఎంతమందిని కరుస్తున్నాయో తెలుస్తుంది. పిల్లల ప్రాణాలు పోయినా పట్టించుకోరా' అని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్‌ను వైఎస్సార్‌సీపీ నేతలు, మహిళలు నిలదీశారు. గురువారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈద్గా మసీదు ఏరియాకు చెందిన మహిళలు కుక్కకాటుకు గురైన చిన్నారులతో కలిసి మున్సిపల్ ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహించారు. కమిషనర్, శానిటేషన్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జింకల రామాంజినేయులు, 29వ వార్డు కౌన్సిలర్ జేసీబీ చాంద్‌బాషా, పార్టీ మహిళా నాయకురాలు జి.శాంతిరాణి మాట్లాడుతూ మున్సిపాల్టీ చరిత్రలో ఇలాంటి అధ్వాన్నమైన కమిషనర్‌ను ఎప్పుడూ చూడలేదన్నారు. వీధి కుక్కల బెడదతో పిల్లలను బయటికి పంపాలంటేనే వణికిపోతున్నామన్నారు. ఈ సమస్యపై ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కమిషనర్ చాలా నిర్లక్ష్యం చేస్తున్నారని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం అక్కడికి చేరుకున్న కమిషనర్ నయీమ్ అహ్మద్‌తో మహిళలు, నాయకులు వాదనకు దిగారు. వార్డుల్లో సమస్యలు విన్నవించేందుకు ఫోన్ చేస్తే స్పందించరా అంటూ నిలదీశారు. 10 రోజుల్లో పరిష్కారం చూపుతామని కమిషనర్ హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. కాలనీవాసులు ప్రసాద్, హసీనా, నేత్రావతి, భాస్కర్ పాల్గొన్నారు.

సెల్ఫీ వీడియో తీసుకుని రైతు ఆత్మహత్యాయత్నం

- భూ సమస్యను పరిష్కరించాలని..


ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు భూమయ్య

కళ్యాణదుర్గం రూరల్: తన భూ సమస్యను పరిష్కరించాలని అనేక సార్లు అధికారులకు తెలిపినా ఫలితం దక్కడం లేదంటూ ఓ రైతు గురువారం ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అంతకు ముందు తన బాధను సెల్ఫీ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో చేసిన పోస్టు వైరల్ అయింది. బాధితుడి తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లుకు చెందిన రైతు బొమ్మయ్యకు గ్రామ సమీపంలోని కొండ వద్ద పొలం ఉంది. ఇటీవల కొండలో ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు తవ్వకాలు మొదలుపెట్టారు. ఇష్టారాజ్యంగా బ్లాస్టింగ్‌లు చేపట్టారు. ఈ క్రమంలో రాళ్లన్నీ ఎగిరి బొమ్మయ్య పొలంలో పడుతున్నాయి. కళ్యాణదుర్గం టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ గోవిందప్పకు చెందిన కంకర మిషన్‌కు టిప్పర్లతో రాళ్లను తరలిస్తున్నారు. దీంతో పొలంలోని పంట నాశనమవుతోంది. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించ లేదు. దీంతో తీవ్ర ఆవేదనకు గురైన బొమ్మయ్య గురువారం అదే కొండపైకి ఎక్కి తన బాధనంతా సెల్ఫీ వీడియోలో వివరించి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే గుర్తించిన స్థానికులు అప్రమత్తమై రైతును కాపాడారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ముదిగల్లు గ్రామస్తులు కోరారు.

పది ఇసుక ట్రాక్టర్ల సీజ్



రాయదుర్గం: వేదవతి నది నుంచి ఇసుకను రాయదుర్గంలోకి అక్రమంగా తరలిస్తున్న పది ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు అర్బన్ సీఐ జయనాయక్, రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు. మండలంలోని 74 ఉడేగోళం వద్ద గురువారం ఉదయం వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో ఇసుక ట్రాక్టర్లు పట్టుబడ్డాయన్నారు. సరైన రికార్డులు చూపకపోవడంతో తహసీల్దార్‌కు రెఫర్ చేసినట్లు వివరించారు. ఉచితం ముసుగులో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో పట్టుబడితే వాహనం సీజ్‌తో పాటు బాధ్యుడిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వివాహిత బలవన్మరణం


మృతురాలు మారెక్క

కణేకల్లు: మండలంలోని జక్కలవడికి గ్రామానికి చెందిన వివాహిత బోయ మారెక్క (40) ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు భర్త ఎర్రిస్వామి, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. గర్భకోశ సమస్యతో బాధపడుతున్న మారెక్కకు 8 నెలల క్రితం వైద్యులు శస్త్రచికిత్స చేశారు. గర్భకోశాన్ని తొలగించిన అనంతరం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ వచ్చిన ఆమె జీవితంపై విరక్తితో గురువారం వేకువజామున ఇంటి ఆవరణలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం నిద్రలేచిన కుటుంబసభ్యులు గమనించి బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

అదృశ్యమైన బాలిక కర్ణాటకలో ప్రత్యక్షం

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో కొలిమి పనులు కోసం వచ్చి ఆగస్టు నెలలో అదృశ్యమైన ఓ మైనర్ బాలిక ఆచూకీని కర్ణాటకలోని కాటిగి ప్రాంతంలో గుర్తించినట్లు బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. కర్ణాటకలోని మొలకాల్మూర్ తాలుకా రాంపురం గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక తన తల్లిదండ్రులతో కలిసి కొలిమి పనుల కోసం బొమ్మనహాళ్‌కు వచ్చింది. పని ఒత్తిడి కావడంతో తన తల్లిదండ్రులకు చెప్పకుండా వెళ్లిపోయింది. దాదాపు నెల రోజుల పాటు కుటుంబ సభ్యులు గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో గత నెల 22న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. కాటిగిలోని తన మేనమామ ఇంట్లో ఉన్నట్లుగా గుర్తించి, అక్కడి నుంచి పిలుచుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

అంతర్రాష్ట్ర సర్వీసుల్లో 'ఉచితం' అసాధ్యం

- త్వరలో ఆర్టీసీకి 1,050 కొత్త ఎలక్ట్రికల్ బస్సులు
- ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు


ఆర్టీసీ బస్సులో ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎండీ ద్వారకా తిరుమలరావు

గుంతకల్లు టౌన్/ఉరవకొండ/గుత్తి: అంతర్రాష్ట్ర సర్వీసుల్లో 'స్త్రీ శక్తి' పథకం అమలు చేయడం అసాధ్యమని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలోనూ అంతర్రాష్ట్ర సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించలేదన్నారు. గురువారం ఆయన అనంతపురం జిల్లాలోని గుంతకల్లు, గుత్తి, ఉరవకొండల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లాలో 'స్త్రీ శక్తి' పథకం అమలు తీరుతెన్నులను పరిశీలించారు. ఆర్టీసీ బస్సుల్లోకి ఎక్కి ఈ పథకం గురించి ప్రయాణికుల అభిప్రాయాన్ని తీసుకున్నారు. ఆర్టీసీ బస్సులో 90 మంది ప్రయాణికులకు మించి ఎక్కించుకోరాదని, ఫుట్‌బోర్డుపై ఎవరినీ నిలబెట్టవద్దని కండక్టర్లను ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్త్రీ శక్తి పథకం కింద రోజూ 25 లక్షల మంది మహిళలు ఉచితంగా రవాణా చేస్తున్నారన్నారు. ఇటీవల బస్సుల్లో మహిళల రద్దీ పెరిగిందని, అవసరమైతేనే మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయాలన్నారు. ఏపీఎస్ ఆర్టీసీకి త్వరలోనే 1,050 కొత్త ఎలక్ట్రికల్ బస్సులు రానున్నాయన్నారు. రాష్ట్రంలో విలువైన ఆర్టీసీ స్థలాలను ప్రైవేట్ కంపెనీలకు ఎట్టిపరిస్థితుల్లోనూ ధారాదత్తం చేసేది లేదన్నారు. పదవీ విరమణ పొందిన ఆర్టీసీ కార్మికుల బెనిఫిట్స్‌ను వీలైనంత త్వరగా చెల్లించేందుకు చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. బస్ డిపోల్లో టాయిలెట్స్, తాగునీరు, ఫ్యాన్లు తగిన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గుత్తిలో అధునాతనంగా ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మిస్తామన్నారు. గుంతకల్లు నుంచి అమరావతి, హైదరాబాద్‌లకు తొలుత ఓ నెల పాటు పైలట్ ప్రాజెక్టుగా సర్వీసులను నడుపుతామని, సక్సెస్ అయితే యథావిధిగా కొనసాగిస్తామని ఆయన వెల్లడించారు. ఆయన వెంట ఆర్టీసీ కడప జోన్ చైర్మన్ పూల నాగరాజు, ఆర్టీసీ జోన్-4 ఈడీ చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ ఆర్‌ఎం శ్రీలక్ష్మి, గుంతకల్లు డీఎం గంగాధర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని గుప్పిట్లో ఎన్నికల కమిషన్

- డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ధ్వజం

ఉరవకొండ: ప్రజల ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ)కు ఉన్నా, ప్రధాని చేతిలో పూర్తిగా బందీ అయి రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై. మధుసూదన్ రెడ్డి విమర్శించారు. దొంగ ఓట్లకు నిరసనగా 'ఓట్ చోర్ గద్దీ చోర్' పేరుతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని గురువారం ఉరవకొండలో ఆయన లాంఛనంగా ప్రారంభించి, మాట్లాడారు. దేశ ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా పోరాటం చేస్తోందన్నారు. ఇప్పటికే సీబీఐ, ఈడీ, ఐటీ లాంటి దర్యాప్తు సంస్థలు మోదీ గుప్పెట్లో ఉన్నాయన్నారు. ఇదే విషయాన్ని కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ సాక్ష్యాలతో సహా బయటపెట్టారన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న వారి ఓట్లను జాబితా నుంచి ఎన్నికల సంఘం తొలగిస్తోందని ఆరోపించారు. ఈ క్రమంలో రాజ్యాంగ హక్కులను కాపాడేందుకు రాహుల్‌గాంధీ నాయకత్వంలో పోరాటాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా మైనార్టీ చైర్మన్ అబ్బాస్ రెహ్మాన్, నాయకులు ఆలం నవాజ్, బొజ్జప్ప, బ్యాళ్ల ప్రసాద్, నబీరసూల్ పాల్గొన్నారు.





క్లుప్తంగా

ప్రజలకు మెరుగైన సేవలందించండి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించడంతో పాటు పల్లెల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు మరింత చొరవ తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కోరారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో అనంతపురంలోని జెడ్పీ క్యాంపస్‌లో గల డీపీఆర్‌సీ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఒక రోజు శిక్షణ తరగతులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అన్ని శాఖల్లోకంటే పంచాయతీరాజ్ శాఖ చాలా పెద్దదన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మేలు చేసే నిర్ణయాలతో పాటు పల్లెల రూపురేఖలు మార్చేందుకు పకడ్బందీ ప్రణాళికలతో ముందుకెళ్లాలని సూచించారు. సీఈఓ శివ శంకర్, డిప్యూటీ సీఈఓ జీవీ సుబ్బయ్య, ఎంపీడీఓలు, జెడ్పీటీసీ సభ్యులు తదితరులు హాజరయ్యారు.

వైద్య సేవల్లో లోపాలు తలెత్తరాదు



వైద్య సేవలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి

పామిడి: స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు అందజేస్తున్న వైద్య సేవల్లో లోపాలు తలెత్తరాదని వైద్య, ఆరోగ్య సిబ్బందిని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ. భ్రమరాంబదేవి హెచ్చరించారు. పామిడి మండలం గజరాంపల్లి గ్రామంలో ఎద్దులపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డెమో త్యాగరాజ్, గంగాధర్, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మేదరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

అనంతపురం టవర్‌క్లాక్: మేదరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని మేదర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలేపల్లి నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సూర్యానగర్‌లో ప్రపంచ మేదర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేదర మహిళలను సన్మానించారు. పోలేపల్లి నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం మేదరలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మూడు నుంచి ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని, కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలని, బ్యాంబూ సొసైటీలను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో కాకర్ల ప్రభాకర్, మురళీకృష్ణ, మహేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

అనంతపురం: టీవీ టవర్ సమీపంలోని శివ సాయి నగర్ ఒకటో క్రాస్‌లో గురువారం బొలేరో వాహనంలో 29 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ జి. వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రజల వద్ద నుంచి తక్కువ రేటుకు పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి తుమకూరు టౌన్‌లో బ్లాక్ మార్కెట్‌కు తరలించి, అమ్ముతున్నట్లు తేలిందన్నారు. అక్రమ రవాణా చేస్తున్న 29 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితుడు మజ్జిగ హరికృష్ణను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

ఆత్మకూరు: త్వరలోనే మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రారంభం కానున్న అభివృద్ధి పనులను దేవదాయశాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం మ్యాప్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి బాబుతో సమావేశమయ్యారు. శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ నిర్మాణం సరిపోవడం లేదన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ పునః నిర్మాణానికి దేవదాయశాఖ సిద్ధంగా ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న కొద్దిపాటి నిర్మాణాలను తొలగించి భక్తుల రద్దీకి అణుగుణంగా నిర్మాణాలను చేపట్టాల్సి ఉందన్నారు.

రైతులందరికీ యూరియా అందిస్తాం

ఆత్మకూరు: వరి సాగు చేసిన ప్రతి రైతుకూ యూరియాను అందిస్తామని తహసీల్దార్ లక్ష్మీనాయక్ తెలిపారు. బి. యాలేరు, ముట్టాల, ఆత్మకూరు గ్రామాల్లో గురువారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో చెరువుల కింద పెద్ద ఎత్తున వరి పైర్లు సాగు చేశారన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియాను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా 42 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు అక్కమ్మ, రాము పాల్గొన్నారు.

చంద్ర'గృహ'ణం

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఎక్కడ మంచి పేరొస్తుందోనని కక్ష కట్టిన కూటమి ప్రభుత్వం పేదలకు శిక్ష వేసింది. నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేలా గత ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీలకు చంద్రబాబు సర్కారులో గ్రహణం పట్టింది. నేడు వాటి గురించి అసలు పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. అనంతపురం రూరల్ మండలం కొడిమి జగనన్న కాలనీలో విలువైన ఇళ్ల సామగ్రి చోరీకి గురవుతోంది. రాత్రి అయ్యిందంటే మందుబాబులు చేరుతున్నారు. గుంపులు గుంపులుగా రూముల్లో మద్యం సేవిస్తూ అక్కడే బాటిళ్లు పడేసి వెళ్తున్నారు. దీంతో పల్లెవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



కొడిమి జగనన్న కాలనీలో ఇళ్ల నడుమ మద్యం సేవించి అక్కడే బాటిళ్లను పడేసిన మందుబాబులు



కొడిమి జగనన్న కాలనీలో ధ్వంసమైన సామగ్రి



టన్నుల కొద్దీ ఉన్న ఐరన్‌ను దొంగిలించగా.. మిగిలిన కొద్దిపాటి ఐరన్



పైకప్పు బోర్డులను పగులగొట్టిన దృశ్యం



జగనన్న కాలనీలో నిరుపయోగంగా మారిన వాటర్ ట్యాంకు

సమతుల ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

అనంతపురం రూరల్: సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలంటే సమతుల ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఉమాశంకరమ్మ సూచించారు. గురువారం అనంతపురం రూరల్ ప్రాజెక్ట్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ఉమాశంకరమ్మ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు సబీరాబేగం, రమణమ్మ, షాను, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: బాలింతలు, గర్భిణులు, పిల్లలు రక్తహీనత బారిన పడకుండా పౌష్టికాహారం తీసుకోవాలని



బాలింతలు, గర్భిణులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత పేర్కొన్నారు. గురువారం గొందిరెడ్డిపల్లి, బొమ్మెపర్తి అంగన్‌వాడీ కేంద్రాల్లో రక్తహీనత, ఇమ్యూనైజేషన్, పోషకాహారం గురించి అవగాహన కల్పించారు.

పరామర్శ

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ఇటుకులపల్లి గ్రామంలో గురువారం మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పర్యటించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, చియ్యేడు సొసైటీ బ్యాంకు మాజీ వైస్ ప్రెసిడెంట్ నారా శివారెడ్డి ఇటీవల మరణించిన నేపథ్యంలో ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బేల్దారి రామాంజి గుండెకు శస్త్రచికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలుసుకుని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సర్పంచ్



శివారెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

భాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రూరల్ మండల కన్వీనర్లు దుగుమర్రి గోవిందరెడ్డి, బండి పవన్‌కుమార్, నాయకులు ఈశ్వరయ్య, ఎంపీటీసీ సభ్యులు సునీల్‌దత్తరెడ్డి, మారెప్ప, నాయకులు చిరంజీవి, ఉప్పరపల్లి శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి, మన్నీల పురుషోత్తం ఉన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం

- మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: సీఎం చంద్రబాబు ప్రతి విషయాన్ని వ్యాపార కోణంలోనే ఆలోచిస్తారని, అందులో భాగంగానే వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు చర్యలు తీసుకోవడం దుర్మార్గమని మేయర్ వసీం విమర్శించారు. గురువారం మేయర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగనన్న 17 వైద్య కళాశాలలను తీసుకురావడం చరిత్రాత్మకమన్నారు. వేలాది మంది వైద్య విద్యనభ్యసించేందుకు వీలు కల్పించేలా నిర్ణయం తీసుకున్నారన్నారు. గత ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీలతో పాటు 143 హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నేడు నాలుగు హామీలను అరకొరగా అమలు చేశారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న మేయర్ వసీం

చొరవతో నగరంలో రూ.20 కోట్లతో క్రిటికల్ కేర్, రూ.300 కోట్లతో ఎంసీహెచ్ బ్లాక్ మంజూరుకు చర్యలు తీసుకున్నారన్నారు. ఇంత వరకు ఎంసీహెచ్ బ్లాక్ ఏర్పాటుపై స్పష్టత లేదన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చలో మెడికల్ కాలేజ్ కార్యక్రమాన్ని చేపడుతున్నారని, ఇటువంటి తరుణంలో ప్రజలు వాస్తవాలు గుర్తించాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు రహంతుల్లా, శ్రీనివాసులు, ఇసాక్, నాయకులు కుళ్లాయస్వామి, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

మీ ఆప్యాయత మరువలేను

- పూర్వపు కలెక్టర్ వినోద్‌కుమార్
- ఘనంగా వీడ్కోలు కార్యక్రమం



వీడ్కోలు సభలో మాట్లాడుతున్న పూర్వపు కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో ఆయన సతీమణి, కలెక్టర్ ఆనంద్, తదితరులు

అనంతపురం అర్బన్: ''మీరు చూపిన ఆప్యాయత మరువలేను. విధి నిర్వహణలో మీరు అందించిన సహకారం అమూల్యం. ముఖ్యంగా జిల్లాలో మీ అందరితో కలిసి పనిచేయడం గొప్ప అదృష్టం'' అని పూర్వపు కలెక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు. బాపట్ల జిల్లాకు కలెక్టర్‌గా బదిలీపై వెళ్లిన వినోద్‌కుమార్‌కు గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జిల్లా యంత్రాంగం తరఫున ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. వినోద్‌కుమార్ దంపతులను కలెక్టర్ ఓ.ఆనంద్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్ఓ ఎ.మలోల, ఇతర అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్‌గా జిల్లా అభివృద్ధికి వినోద్‌కుమార్ విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

కులగణన చేపట్టాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి



మాట్లాడుతున్న నారాయణస్వామి

అనంతపురం అర్బన్: జనగణనతో పాటు కులగణనను కూటమి ప్రభుత్వం చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి డిమాండ్ చేశారు. కులగణన చేపట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు అన్ని రాజకీయ పక్షాలు, కులసంఘాలు, ప్రజాసంఘాలను కలుపుకుని ప్రజా ఉద్యమాన్ని చేపడతామన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ ఈనెల 27న స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో జిల్లాస్థాయిలో అన్ని రాజకీయ పక్షాలు, కుల, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నామన్నారు. ఉద్యమాన్ని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు అందరూ హాజరై సలహాలు, సూచనలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అన్నివర్గాల పేదలకు అండగా ఉంటూ వారి సంక్షేమం కోసం నిస్వార్థంగా సేవలందిస్తున్న ఆర్‌డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్యదర్శివర్గ సభ్యులు కేశవరెడ్డి, శ్రీరాములు, గోపాల్, కార్యవర్గ సభ్యులు లింగమయ్య, రమణయ్య, రాజేష్ గౌడ్, మల్లికార్జున, సంతోష్‌కుమార్, చిన్నప్పయాదవ్, పెద్దయ్య, పార్వతిప్రసాద్, కుళ్లాయిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాడాలి

- ఆశావర్కర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

అనంతపురం అర్బన్: హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి సమైక్యంగా ఉద్యమించాలని ఆశా వర్కర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు అనుకూల విధానాలను అనుసరిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. గురువారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆశావర్కర్ల సంఘం జిల్లా మహాసభలు నిర్వహించారు. సభకు ధనలక్ష్మితో పాటు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హక్కుల సాధనకు ఐక్య పోరాటాలు చేపట్టాలన్నారు. ఆశావర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలన్నారు. మెడికల్, క్యాజువల్ లీవులు వర్తింపజేయాలన్నారు. అంతిమ సంస్కారాల ఖర్చులకు రూ.20 వేలు ఇవ్వాలన్నారు. జనాభాకు అనుగుణంగా ఆశా కార్మికుల నియామకాలు చేపట్టాలన్నారు. ఇక కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మద్దతునిస్తూ ప్రజలపై భారం మోపుతోందన్నారు. ప్రభుత్వ స్థలాల్లో పేదలు వేసుకున్న గుడిసెలపై రాష్ట్ర ప్రభుత్వం దాడులు చేస్తూ



మాట్లాడుతున్న ధనలక్ష్మి

తొలగిస్తోందని మండిపడ్డారు. అదే కార్పొరేట్ సంస్థలకు మాత్రం ఒక్క రూపాయికి ఎకరా చొప్పున వందల ఎకరాలను అప్పగిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, ఉపాధ్యక్షుడు రామాంజినేయులు, ఆశావర్కర్ల సంఘం నాయకురాళ్లు కుళ్లాయమ్మ, రాధమ్మ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మహాసభల సందర్భంగా 30 మందితో ఆశా వర్కర్ల సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా మాలతి, ప్రధాన కార్యదర్శిగా నాగమణి, కోశాధికారిగా భారతి, ఉపాధ్యక్షులుగా సుజాత, ప్రమీల, వరలక్ష్మి, భాగ్యమ్మ, సహాయ కార్యదర్శులుగా కళావతి, వెంకటలక్ష్మి, దస్తగిరమ్మ, సరస్వతి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి

అనంతపురం టవర్‌క్లాక్: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గొర్ల మారుతీ నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ తలపెట్టిన 'చలో మెడికల్ కాలేజ్' కార్యక్రమాన్ని యువత విజయవంతం చేయాలని కోరారు. సీఎం చంద్రబాబు తక్షణమే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

తోపుదుర్తి కవితను పరామర్శించిన జక్కంపూడి



తోపుదుర్తి భాస్కర్ రెడ్డి సతీమణి, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ కవితను పరామర్శిస్తున్న జక్కంపూడి రాజా, అనంత వెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ సీనియర్ నేత తోపుదుర్తి భాస్కర్ రెడ్డి సతీమణి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తోపుదుర్తి కవితను యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా గురువారం పరామర్శించారు. ఇటీవల తోపుదుర్తి భాస్కర్ రెడ్డి ఆకస్మిక మరణం పొందిన విషయం విదితమే. ఈ సందర్భంగా తోపుదుర్తి కవిత నివాసంలో తోపుదుర్తి భాస్కర్ రెడ్డి చిత్రపటానికి జక్కంపూడి రాజా నివాళులర్పించారు. అంతకుముందు జిల్లా కేంద్రానికి వచ్చిన జక్కంపూడి రాజా మొదటగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడి నుంచి మాజీ ఎమ్మెల్యేలు అనంత, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డితో కలసి కవిత ఇంటికి వెళ్లారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

అనంతపురం అర్బన్: ప్రజలకు మెరుగైన సేవలు అందించి వారి మన్ననలు పొందాలని ఉద్యోగులకు కలెక్టర్ ఓ.ఆనంద్ సూచించారు. కలెక్టర్‌ను గురువారం ఆయన చాంబర్‌లో అమరావతి జేఏసీ చైర్మన్ దివాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి పీఎస్ ఖాన్, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి అంతిమ లక్ష్యం ప్రభుత్వానికి, ప్రజలకు సేవలందించడమేన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని విమర్శలకు, ఆరోపణలకు తావివ్వకుండా చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని చెప్పారు. కార్యక్రమంలో జేఏసీ అసోసియేట్ చైర్మన్ మల్లరాయుడు, మహిళ విభాగం చైర్‌పర్సన్ సురేఖరావు, ప్రధాన కార్యదర్శి కృష్ణజ్యోతి, కోశాధికారి నీరజ, వైస్ చైర్‌పర్సన్ నాగవేణి, రెవెన్యూ ఉద్యోగుల సంఘం కోశాధికారి పునీత్‌బాబు, నాయకులు ఆది, ముక్తియార్, నారాయణస్వామి, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు హరిప్రసాద్, కోశాధికారి శ్రీలక్ష్మి, నాయకులు గోపి, 14వ బెటాలియన్ స్పెషల్ పోలీసు సంఘం అధ్యక్షుడు పెద్దయ్య, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నప్ప, నాయకులు మురళీధర్, ఖలందర్, శివప్రసాద్, వీఆర్ఓ సంఘం



కలెక్టర్ ఆనంద్‌కు జేఏసీ నాయకులను పరిచయం చేస్తున్న దివాకర్‌రావు

నాయకులు రామకృష్ణ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు అశోక్, నాగేంద్ర పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు

కలెక్టర్ ఓ.ఆనంద్‌ను వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను గురువారం ఆయన చాంబర్‌లో పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వర్ల శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిఅరుణ్‌కుమార్, కార్యదర్శులు కమలాకర్, ప్రణీత్‌కుమార్, వెంకటపతిరాజు, రామ్‌సతీష్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గౌస్‌పీరా తదితరులు కలిసి పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రబాబు చరిత్ర హీనుడు

అనంతపురం టవర్‌క్లాక్: సీఎం చంద్రబాబు చరిత్ర హీనుడని వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాకే మహేష్ విమర్శించారు. గురువారం స్థానిక వినాయక నగర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాకే మహేష్ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి జిల్లాకు మెడికల్ కళాశాల నిర్మించ తలపెట్టారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలని నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తలపెట్టిన 'చలో మెడికల్ కాలేజ్'



సమావేశంలో మాట్లాడుతున్న సాకే మహేష్

కార్యక్రమానికి ఎస్టీ సెల్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు. కార్యక్రమంలో సాకే కొత్తరాయుడు, సాకే రాజు, సాకే మల్లి, సాకే అరుణ్, సాకే కృష్ణ, సాకే రవి, సాకే రమణ, గుజ్జల అనిల్, గుజ్జల శివ తదితరులు పాల్గొన్నారు.

21న 'కాలభైరవ సంహారం' నాటక ప్రదర్శన

అనంతపురం కల్చరల్: ఎల్కేపీ మాజీ కార్యదర్శి గాజుల నారాయణస్వామి జయంతి వేడుకల సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక లలిత కళాపరిషత్తులో 'కాలభైరవ సంహారం' నాటకాన్ని ప్రదర్శిస్తున్నారు. వీణ అవార్డుకు ఎంపికైన గొప్ప పౌరాణిక నాటకాన్ని సీనియర్ నటుడు రామగోవిందసాగర్ దర్శకత్వంలో జిల్లాకు చెందిన నటీనటులు అద్భుతంగా ప్రదర్శిస్తారని, కళాభిమానులు విచ్చేయాలని ఎల్కేపీ సెక్రటరీ పద్మజ ఓ ప్రకటనలో తెలిపారు.

కమనీయం.. రాధాకృష్ణుల కల్యాణం

అనంతపురం కల్చరల్: చాతుర్మాస దీక్షల్లో భాగంగా సాయిట్రస్టు ఆధ్వర్యంలో గురువారం రాత్రి తపోవనంలోని శివశక్తి సాయి దేవాలయంలో రాధాకృష్ణుల కల్యాణం కమనీయంగా జరిగింది. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మణూరు నాగరాజు పర్యవేక్షణలో వేదపండితులు కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఎదుర్కోలు, మాంగల్య ధారణ, తలంబ్రాలు, శయనోత్సవం ఘట్టాలు భక్తిభావం ఉట్టిపడేలా చేశాయి. అనంతరం ప్రసాద వితరణ చేశారు. అభిషేకం, విశ్వక్సేన ఆరాధనలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ చాతుర్మాసాల్లో 8 ద్వాదశిలలో 8 మంది దేవతా మూర్తుల కల్యాణమహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు రాఘవేంద్ర, దేవేంద్ర పాల్గొన్నారు.

గుండెపోటుతో జెడ్పీ ఉద్యోగి మృతి



ప్రసాద్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: అనంతపురంలోని పంచాయతీ రాజ్ సబ్ డివిజన్-1 కార్యాలయంలో పని చేసే ఆఫీస్ సబార్డినేట్ గుజ్జల ప్రసాద్(56) గుండెపోటుతో గురువారం మరణించారు. బుధవారం అర్ధరాత్రి గుండెపోటుకు గురి కావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స ఫలించక ప్రాణాలొదిలారు. ప్రసాద్‌కు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ జెడ్పీ ఉద్యోగులతో కలసి ప్రసాద్ ఇంటికి వెళ్లారు. ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. క్రమశిక్షణ కలిగిన ఉద్యోగిని కోల్పోయామని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంత్యక్రియల కోసం తక్షణ సాయంగా పీఆర్ సబ్ డివిజన్-1 డీఈఈ లక్ష్మీనారాయణ రూ.25 వేలు మృతుని కుటుంబ సభ్యులకు అందించారు. జెడ్పీ, పీఆర్ ఉద్యోగులందరూ ప్రసాద్ మృతదేహాన్ని సందర్శించారు.

డిమాండ్లు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌ఏలు

చెన్నేకొత్తపల్లి: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కరించాలని కోరుతూ మండలంలోని అన్ని గ్రామాల వీఆర్‌ఏలు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు గురువారం అందజేశారు. వీఆర్‌ఏ సంఘం నాయకులు ఆంజనేయులు, ఓబుళపతి, లింగన్నలు మాట్లాడుతూ వీఆర్‌ఏగా విధులు నిర్వహించే వారు మరణిస్తే వారి కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, డీఏ పెంచాలన్నారు. డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

CHANGE OF NAME

I, **B.S.NAGARAJU** (Old Name), S/o. Balija Sanjeeva Rayudu, D.No. 4-2-575, Yuvajana Colony, ANANTAPURAMU, PIN Code : 515001. I have change my name **B.S.NAGARAJU** (Old Name) to **BALIJA NAGARAJU** (New Name). Henceforth my name as **BALIJA NAGARAJU** for all purpose.

CHANGE OF NAME

I, **BALIJA NAGARAJU**, S/o. Balija Sanjeeva Rayudu, D.No. 4-2-575, Yuvajana Colony, Anantapuramu, PIN Code : 515 001. I have change my son name **N. PRATHIKSH** (Old Name) to **BALIJA RITHVIK RAYUDU** (New Name). Henceforth my son name as **BALIJA RITHVIK RAYUDU** for all purpose.